# సాక్షి
## పశ్చిమగోదావరి

ఆదివారం । 28 । సెప్టెంబర్ । 2025





**'జూనోటిక్' నుంచి రక్షణ ఇలా..**
జూనోటిక్ వ్యాధి జంతువుల నుంచి మనుషులకు సంక్రమిస్తుంది. నేడు ప్రపంచ రేబిస్ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం. IIలో ▸



**పిచికారీలో జాగ్రత్తలు**
రసాయన మందులు విషపూరితమైనవి కావడం వల్ల వీటిని పిచికారీ చేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయాధికారి సూచించారు. IIలో ▸



**తణుకులో భారీ చోరీ**
ఒంటరిగా నివసిస్తున్న వృద్ధురాలి ఇంట్లోకి చొరబడి బంగారు ఆభరణాలు దోచుకున్న ఘటన తణుకులో సంచలనం రేకెత్తించింది. IIలో ▸

# పీహెచ్‌సీ వైద్యుల సమ్మెబాట

- సర్వీస్ వైద్యుల పీజీ కోటా తగ్గింపు
- ఇంక్రిమెంట్లలోనూ మొండిచేయి
- డిమాండ్ల సాధనకు సోమవారం నుంచి సమ్మెలోకి..
- అత్యవసర కేసులు మినహా ఓపీ విధుల బహిష్కరణకు నిర్ణయం
- జిల్లాలో 54 పీహెచ్‌సీల్లో 80 మంది వైద్యులు



కాళ్లలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

సాక్షి, భీమవరం: జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (పీహెచ్‌సీ) వైద్యులు సమ్మె సైరన్ మోగిస్తున్నారు. డిమాండ్ల సాధన కోసం సోమవారం నుంచి పోరుబాటకు సిద్ధమవుతున్నారు. ఈ మేరకు ఏపీ ప్రైమరీ హెల్త్ సెంటర్స్ డాక్టర్స్ అసోసియేషన్ (ఏపీపీహెచ్‌సీడీఏ) నాయకులు వారం క్రితమే ఉన్నతాధికారులకు నోటీసు అందజేశారు. ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో తదుపరి కార్యాచరణ అమలు చేసే యోచనలో నిమగ్నమయ్యారు.

**52 పీహెచ్‌సీలు.. 80 మంది వైద్యులు**

జిల్లాలో అర్బన్ పీహెచ్‌సీలు 18, రూరల్ పీహెచ్‌సీలు 34 ఉన్నాయి. వీటి పరిధిలో దాదాపు 80 మంది వైద్యులు సేవలందిస్తున్నారు. పీహెచ్‌సీ వైద్యులు పీజీ కోర్సులు చేసేందుకు గతంలో క్లినికల్‌కు 30 శాతం, ఫిజియాలజీ, ఎనాటమీ, ఫార్మసీ, ఫోరెన్సిక్ మెడిసిన్, కమ్యూనిటీ మెడిసిన్ తదితర నాన్ క్లినికల్‌కు 50 శాతం సీట్లు ఉండేవి. కూటమి ప్రభుత్వం గతేడాది క్లినికల్‌కు 15 శాతానికి, నాన్ క్లినికల్ 30 శాతానికి తగ్గించింది. అప్పట్లో వైద్యులు ఆందోళనకు దిగడంతో క్లినికల్ 20 శాతానికి పెంచారు. తాజాగా మళ్లీ 15 శాతానికి తగ్గించేసినట్టుగా ఏపీపీహెచ్‌సీడీఏ చెబుతోంది. సీహెచ్‌సీల్లో పనిచేస్తే మూడు, నాలుగేళ్లకే డిప్యూటీ సివిల్ సర్జన్స్‌గా ప్రమోషన్స్ ఇస్తుంటే 20 ఏళ్లుగా పీహెచ్‌సీల్లో సివిల్ అసిస్టెంట్ సర్జన్స్ పదోన్నతులు రాక సీనియర్ మెడికల్ ఆఫీసర్స్‌గానే మిగిలిపోతున్నారని ఆవేదన చెందుతున్నారు.

**3 నుంచి దీక్షలు :** సమస్యల పరిష్కారం కోసం ఏపీపీహెచ్‌సీడీఏ ఆధ్వర్యంలో ఈనెల 19న పీహెచ్‌సీ వైద్యులు నోటీసులు అందజేశారు. దశలవారీగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తున్నారు. అందులో భాగంగా దశలవారీగా సేవలను నిలుపుదల చేస్తున్నారు. సోమవారం నుంచి అత్యవసర సేవలు మినహా ఓపీని బహిష్కరించనున్నట్టు అసోసియేషన్ నేతలు చెబుతున్నారు. అక్టోబర్ 3 నుంచి అమరావతిలో నిరాహార దీక్షలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

**ఆందోళనలో ప్రజలు**

ప్రతికూల వాతావరణ పరిస్థితులతో విషజ్వరాలు విజృంభిస్తున్న తరుణంలో పీహెచ్‌సీ వైద్యుల పోరుబాట సామాన్య ప్రజానీకాన్ని ఆందోళనకు గురిచేస్తోంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు, అపారిశుద్ధ్య వాతావరణంతో టైఫాయిడ్, విషజ్వరాలు ప్రబలుతున్నాయి. ఏ ఆస్పత్రిలో చూసినా జ్వరాలతో బాధపడుతున్న వారు కనిపిస్తున్నారు. రోజూవారి వచ్చే కేసుల్లో జ్వరపీడితులు ఎక్కువగా ఉంటున్నట్టు వైద్య సిబ్బంది చెబుతున్నారు. ఈ తరుణంలో పీహెచ్‌సీ వైద్యులు ఓపీ బహిష్కరిస్తే పేదవర్గాల వారు వైద్యం కోసం తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందంటున్నారు. ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించి ఆర్థిక ఇబ్బందులు పడాల్సి వస్తుందన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

### సేవలను గుర్తించని కూటమి ప్రభుత్వం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన సర్వేలు, పల్స్ పోలియో, వరదలు, విపత్తుల సమయంలో క్షేత్రస్థాయిలో సేవలందిస్తున్న సివిల్ అసిస్టెంట్ సర్జన్లకు పదోన్నతులు రావడం లేదని, జాయిన్ అయినప్పుడు ఉన్న కేడర్‌లోనే రిటైర్ అవుతున్న పరిస్థితి ఉంటుందని వైద్యులు అంటున్నారు. గిరిజన ప్రాంతాల్లో కనీస వసతులు లేకుండా పనిచేస్తున్న పీహెచ్‌సీ వైద్యులు ఎంతోమంది ఉన్నారని, అద్దెకు ఇళ్లు కూడా దొరకని పరిస్థితుల్లో సేవలందిస్తున్న వారికి అలవెన్స్ కూడా ఇవ్వడం లేదంటున్నారు. అప్పటికప్పుడు రిపోర్టులు కోరడం, వైద్య విభాగానికి సంబంధం లేని వారి అజమాయిషీ ఇలా ఎన్నో విషయాల్లో పీహెచ్‌సీ వైద్యులను ఇబ్బందులు పాల్జేస్తున్నారని ఏపీపీహెచ్‌సీడీఏ నేతలు చెబుతున్నారు.

### డిమాండ్లు

- సర్వీస్‌లోని పీహెచ్‌సీ వైద్యులకు పీజీ కోటాలో సీట్లను పునరుద్ధరించాలి.
- టైం బాండ్ ప్రమోషన్స్ కల్పించాలి.
- గిరిజన ప్రాంతాల్లో పనిచేసేవారికి బేసిక్‌పై 50 శాతం అలవెన్స్ ఇవ్వాలి.
- చంద్రన్న సంచార చికిత్స కార్యక్రమానికి రూ.5 వేలు అలవెన్స్ ఇవ్వాలి.
- కౌన్సెలింగ్ విషయంలో అర్బన్ అండ్ నేటివిటీపై ఆరేళ్ల గడువుని ఐదేళ్లకు కుదించాలి, నేటివిటీపై స్పష్టత ఇవ్వాలి.

### సమస్యల పరిష్కారం కోసమే..



పీహెచ్‌సీ వైద్యులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాం. ఇప్పటికే దశలవారీగా ఆందోళన ప్రారంభించాం. ప్రభుత్వం స్పందించకుంటే ఏపీపీహెచ్‌సీడీఏ పిలుపుమేరకు సోమవారం అత్యవసర సేవలు మినహా ఓపీ విధులను బహిష్కరిస్తాం. అక్టోబరు 3న విజయవాడలో నిరాహార దీక్షలు చేపడతాం.

– డా.సీహెచ్ వెంకటరంగం నాయుడు, ఏపీపీహెచ్‌సీడీఏ జిల్లా అధ్యక్షుడు

## న్యూస్‌రీల్

### గళమెత్తిన సచివాలయ ఉద్యోగులు


ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

పాలకొల్లు సెంట్రల్: తమ న్యాయబద్ధమైన కోరికలు వెంటనే పరిష్కరించాలని సచివాలయ ఉద్యోగుల నూతన కమిటీ అధ్యక్షుడు దేవరకొండ రాజ్‌కుమార్ అన్నారు. శనివారం రాష్ట్ర ఏపీవీడబ్ల్యూఎస్ఈ జేఏసీ కమిటీ పిలుపు మేరకు స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సచివాలయ నూతన కమిటీ ఆధ్వర్యంలో గాంధీజీ, అంబేడ్కర్ విగ్రహాలకు వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగుల నోషనల్ ఇంక్రిమెంట్లు, వారి బకాయిలు, ప్రమోషన్స్, మదర్ డిపార్ట్‌మెంట్లలో విధుల నిర్వహణ, డోర్ టు డోర్ సర్వీస్ అందించే విధానానికి స్వస్తి పలకడం వంటి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందించినట్టు తెలిపారు. నూతన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### 29 నుంచి పారిశుద్ధ్య కార్మికుల సమ్మె


తణుకులో సమ్మె నోటీసు ఇస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు పారిశుద్ధ్య కార్మికుల నాలుగు నెలల వేతన బకాయిలు, 40 నెలల పీఎఫ్ బకాయిలు తక్షణమే చెల్లించాలని, తణుకు జిల్లా కేంద్ర ప్రభుత్వాసుపత్రి 150 పడకల స్థాయికి అనుగుణంగా కనీసం 50 మందికి తగ్గకుండా పారిశుద్ధ్య కార్మికులను నియమించాలని కోరుతూ ఈనెల 29 నుంచి సమ్మెలోకి వెళుతున్నట్టు ఏపీ మెడికల్ కాంటాక్టు వర్కర్స్ యూనియన్ తణుకు శాఖ అధ్యక్షుడు కోనాల భీమారావు అన్నారు. యూనియన్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక జిల్లా కేంద్ర ప్రభుత్వాస్పత్రి ఆవరణలో కార్మికులతో కలిసి నిరసన తెలిపి అనంతరం సూపరింటెండెంట్ కె.సాయికిరణ్‌కు సమ్మె నోటీసు అందజేశారు. భీమారావు మాట్లాడుతూ కార్మికులకు తక్కువ వేతనాలు కూడా ప్రతినెలా సక్రమంగా ఇవ్వడం లేదన్నారు. ఆస్పత్రి స్థాయికి తగ్గట్టు కార్మికులు లేకపోవడంతో ఉన్న వారికి భారం పడుతోందన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నాయకులు ధర్మాని పుష్పలత, భారతి, సీహెచ్ మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

### హామీలు అమలు చేయాలి


మాట్లాడుతున్న నరసింహమూర్తి

తణుకు అర్బన్: గీత కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నరసింహమూర్తి డిమాండ్ చేశారు. శనివారం సంఘ జిల్లా ఆఫీస్ బ్యారర్స్ సమావేశం తణుకు అమరవీరుల భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహమూర్తి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం గ్రామాల్లో మద్యాన్ని ఏరులై పారిస్తూ లక్షలాది మంది గీత కార్మికుల ప్రయోజనాలను దిగజార్చిందన్నారు. గీత కార్మికులు ఉన్న ఊరిలో బతకలేక వలసలు వెళ్లే పరిస్థితి వచ్చిందన్నారు. సంఘ జిల్లా అధ్యక్షుడు కామన మునిస్వామి మాట్లాడుతూ ప్రమాదవశాత్తూ చెట్టుపై నుంచి పడి మృతిచెందిన కార్మికులకు పక్క రాష్ట్రంలో రూ.5 లక్షల పరిహారం ఇస్తున్నారని, రాష్ట్రంలో మాత్రం ఒక్క రూపాయి కూడా ఇవ్వడం లేదన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు బొక్క చంటి పాల్గొన్నారు.

### జీఎస్టీ తగ్గింపుపై విస్తృత ప్రచారం

భీమవరం(ప్రకాశం చౌక్): జీఎస్టీ తగ్గింపు ఫలాలు అందరికీ తెలిసేలా విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ సీహెచ్ నాగరాణి తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో వాణిజ్యపన్నుల శాఖ ఆధ్వర్యంలో జీఎస్టీ సంస్కరణల అమలులో భాగం ఆటోమొబైల్స్, పౌల్ట్రీ, ఆక్వా, రవాణా, నిర్మాణ, బీమా, చాంబర్ ఆఫ్ కామర్స్, కిరాణా మర్చంట్ తదితర వ్యాపార సంస్థలు అసోసియేషన్స్ ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. జీఎస్టీ 2.0పై ప్రజల్లో అవగాహన కల్పించే తమ వంతు సహకారం అందించాలని కోరారు. జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, ఏలూరు డివిజన్ వాణిజ్య పన్నుల డిప్యూటీ కమిషనర్ కేపీ శైలజ, డీపీఓ ఎం.రామనాథరెడ్డి పాల్గొన్నారు.

### ఆక్వా వర్సిటీపై నిర్లక్ష్యం


పనులను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

నరసాపురం రూరల్: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో తలపెట్టిన ఆక్వా యూనివర్సిటీ నిర్మాణ పనులను పూర్తిచేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎన్‌వీ గోపాలన్ కోరారు. శనివారం పార్టీ ప్రతినిధుల బృందం యూనివర్సిటీ నిర్మాణాలను పరిశీలించింది. గోపాలన్ మాట్లాడుతూ ఆక్వా అభివృద్ధికి తోడ్పడే వర్సిటీ నిర్మాణంపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తోందని విమర్శించారు. పనులు ప్రారంభించి మూడేళ్లు దాటినా పునాది దశ కూడా పూర్తికాకపోవడం సిగ్గుచేటన్నారు. దీంతో మత్స్య కళాశాల విద్యార్థులు రెండేళ్లుగా తుపాను రక్షిత భవనంలో ఇరుకు గదుల్లో అవస్థలు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వర్సిటీపై ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కవురు పెద్దిరాజు, పట్టణ కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.



### అభయాంజనేయస్వామి సన్నిధిలో హైకోర్టు జడ్జి


స్వామి సన్నిధిలో జడ్జి మల్లికార్జునరావు

పెదపాడు: అప్పనవీడులోని అభయాంజనేయస్వామిని హైకోర్టు జడ్జి టి.మల్లికార్జునరావు దంపతులు శనివారం దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. ముందుగా అర్చకులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.

**రాట్నాలమ్మ సన్నిధిలో..**

పెదవేగి: హైకోర్టు జడ్జి టి.మల్లికార్జునరావు దంపతులు రాట్నాలకుంటలోని రాట్నాలమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయించారు.

# బాలకృష్ణది పశు ప్రవృత్తి

**మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ**



తాడేపల్లిగూడెం: హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణది పశు ప్రవృత్తి అని మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ విమర్శించారు. తాడేపల్లిగూడెంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజాదరణ పొంది, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురించి బాలకృష్ణ అసెంబ్లీలో సంస్కారహీనంగా, సభ్యత లేకుండా మాట్లాడటం సరికాదని కొట్టు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయం చూశాక ఆయన తండ్రి సంస్కారం బాలకృష్ణలో ఏ కోణంలో కూడా లేదనిపించిందని ఘాటుగా విమర్శించారు. సినీ నటుడు చిరంజీవి అందరూ గౌరవించే సినీ పెద్ద అని, ఆయన ఉన్నతిని బాలకృష్ణ స్వీకరించలేడని విమర్శించారు. బాలకృష్ణ అనుచిత వ్యాఖ్యలు చేస్తుండగా సభాస్థానంలో ఉన్న వ్యక్తి నవ్వడం చూస్తుంటే సభాస్థానాన్ని కించపర్చడమేనని మండిపడ్డారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ ఇలా జరగదన్నారు. బాలకృష్ణ ప్రవర్తన, మాట తీరు చూస్తుంటే అసెంబ్లీకి వచ్చే సభ్యులకు బ్రీత్ ఎనలైజర్ పరీక్షలు చేసి లోపలికి అనుమతించాల్సించిన పరిస్థితి ఉందేమో అని సందేహం వ్యక్తం చేశారు. అలాగే ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ వయసుకు తగ్గట్టుగా మాట్లాడాలని కొట్టు హితవు పలికారు.

**బాలకృష్ణ ఒక సైకో**

బాలకృష్ణ ఒక సైకో అని కొట్టు విమర్శించారు. ఆయన ఇంట్లో ఒక సినీ నిర్మాతను తుపాకీతో కాల్చి చంపారని, దానికి గత కారణం అందరికీ తెలుసని కొట్టు అన్నారు. ఆనాడు బాలకృష్ణ ఎర్రగడ్డ ఆస్పత్రి నుంచి మెంటల్ సర్టిఫికెట్ తెచ్చుకున్న సంగతి తెలిసిందేనని గుర్తుచేశారు. గతంలో ఇలానే మహిళలను కించపరిచేలా బాలకృష్ణ మాట్లాడారన్నారు. చిరంజీవి పట్ల జగన్ ఎంత అభిమానంగా, ఆప్యాయంగా ఉన్నారో.. సినీ పరిశ్రమ సమస్యలను చిరంజీవి బృందంతో పరిష్కరించే విషయంలో జగన్ ఎంత హుందాగా ప్రవర్తించారో అందరికీ తెలిసిందేనని చెప్పారు. తండ్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఎంత హుందాగా ప్రవర్తించారో, అదే ఒరవడితో జగన్ పాలనను అందించారని కొట్టు అన్నారు.

### మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ సరికాదు

ఏలూరు టౌన్: కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని నాలుగు ప్రభుత్వ మెడికల్ కళాశాలలను తొలివిడతలో పీపీపీ పద్ధతిలో నిర్వహించేలా టెండర్లకు నోటిఫికేషన్ జారీ చేయటం సరికాదని, దీనిపై పునరాలోచన చేయాలని వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆల్తి శ్రీనివాస్ అన్నారు. శనివారం వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో డీఆర్వో విశ్వేశ్వరరావుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో రాష్ట్రంలో ప్రజలు తీవ్రంగా నష్టపోతారనీ, ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటుకు అప్పగించటం సరికాదన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఐదు ప్రభుత్వ మెడికల్ కాలేజీలను నిర్మించి, ప్రారంభించారని గుర్తుచేశారు. చంద్రబాబు తన 15 ఏళ్ల ముఖ్యమంత్రి ప్రస్థానంలో ఏనాడైనా ఒక్క ప్రభుత్వ మెడికల్ కాలేజీని అయినా తీసుకువచ్చారా అని ప్రశ్నించారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం కాకుండా అడ్డుకుంటామని స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి, న్యాయవాది మున్నుల జాన్‌గురునాథ్, నిమ్మల రాము, యర్రా సురేష్ పాల్గొన్నారు.

### ఆర్జీయూకేటీ ఎంఓయూలు


కంపెనీల ప్రతినిధులతో ఆర్జీయూకేటీ అధికారులు

నూజివీడు: ఆర్జీయూకేటీ అధికారులు నూజివీడు ట్రిపుల్‌ఐటీలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో పలు సంస్థలతో రెండు అవగాహన ఒప్పందాలను కుదుర్చుకున్నారు. ఫిజిక్స్ వాలా లిమిటెడ్‌తో ఒప్పందం మేరకు నూజివీడు, ఇడుపులపాయ, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్‌ఐటీల విద్యార్థులకు 14 కోర్సులను ఉచితంగా అందుబాటులోకి తీసుకువస్తారు. వీటిలో వీటిలో గేట్, క్యాట్‌లతో పాటు ప్రొఫెషనల్ సర్టిఫికేషన్ ప్రోగ్రాంలు, సెమినార్లు, వెబినార్లు, మాక్ పరీక్షలు, మెంటార్ షిప్ ఉంటాయి. అలాగే కౌన్సిల్ ఫర్ స్కిల్ అండ్ కాంపెటెన్సీస్‌తో ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. దీని ద్వారా పారిశ్రామిక అనుభవం, ఇంటర్న్‌షిప్‌లు, నిపుణుల ఉపన్యాసాలు, వ్యాపార శిక్షణ, వర్చువల్ లెర్నింగ్ అవకాశాల ద్వారా విద్యార్థుల శిక్షణను మెరుగుపరుస్తారు. రిజిస్ట్రార్ ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్, సీఏఓ బండి ప్రసాద్, సెంట్రల్ డీన్ దువ్వూరు శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

# పండగ వేళా పస్తులే!

- జీతాలు రాక సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగుల ఆకలి కేకలు
- ఎన్నికల్లో హామీ ఇచ్చిన మినిట్స్ అమలు చేయాలని డిమాండ్
- ఆగస్టు నెల జీతం బకాయి సుమారు రూ.7 కోట్లు
- ఉమ్మడి జిల్లాలో సుమారు వెయ్యి మంది కాంట్రాక్టు ఉద్యోగులు




సమస్యల పరిష్కారం కోసం దీక్షలు చేస్తున్న సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు (ఫైల్)

ఏలూరు (ఆర్ఆర్‌పేట): సమగ్ర శిక్షా అభియాన్‌లో ఏళ్ల తరబడి కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగులు కూటమి ప్రభుత్వం నిర్వాకంతో ఆకలితో అలమటిస్తున్నారు. రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా పనిచేస్తున్నా జీతాలు సక్రమంగా రాక కుటుంబంతో సహా పస్తులు ఉండాల్సిన పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ఆగస్టు నెల జీతాలు ఇప్పటికీ వారి బ్యాంకు ఖాతాల్లో పడలేదు. అలాగే సెప్టెంబర్ నెల జీతాల విడుదలపై కూడా ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పష్టత రాకపోవడంతో వీరు దసరా పండగ వేళ కూడా ప్రభుత్వం తమను పస్తులు పెడుతుందా అనే ఆవేదన చెందుతున్నారు.

**ఉమ్మడి జిల్లాలో సుమారు 1,000 మంది..**

సమగ్ర శిక్షాలో ఆర్ట్, క్రాఫ్ట్, పీఈటీ వంటి పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్స్, ఎంఐఎస్ కో–ఆర్డినేటర్లు, క్లస్టర్ రీసోర్స్ పర్సన్లు, పీఈటీలు, ఫిజియోథెరపిస్టులు, సైట్ ఇంజనీర్లు, మెసెంజర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, డ్రైవర్లు వంటి అన్ని వర్గాలకు చెందిన కాంట్రాక్టు ఉద్యోగులు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో సుమారు 1,000 మంది ఉన్నారు. వీరందరికీ కలిపి ఒక నెల వేతనం సుమారుగా రూ.7 కోట్లు ఉంటుంది. ఆగస్టు నెల జీతాలు ఇప్పటికీ విడుదల చేయకపోవడం, సెప్టెంబర్ నెల జీతాలపై స్పష్టత ఇవ్వకపోవడం వీరిని మరింత ఆందోళనకు గురిచేస్తోంది.

**మినిట్స్ అమలుకు డిమాండ్ :** తమ డిమాండ్ల సాధన కోసం సమగ్ర శిక్ష ఉద్యోగులు గత ప్రభుత్వ హయాంలో దాదాపు 21 రోజులు సమ్మె చేశారు. ఆ సమయంలో ప్రభుత్వం వీరిని చర్చలకు పిలిచి వీరి డిమాండ్లను పరిష్కరించడానికి సానుకూలంగా స్పందించింది. ప్రభుత్వ ప్రతినిధులు, సమగ్ర శిక్ష రాష్ట్ర ఉన్నతాధికారులు వీరితో చర్చించి మినిట్స్ రూపొందించారు. దాని ప్రకారం వారి గౌరవ వేతనాన్ని 23 శాతం పెంచడానికి అంగీకరించి ఆ మేరకు పెంచిన వేతనాలను అమలు చేసింది. అయితే హెచ్‌ఆర్ పాలసీ అమలుకు, మినిమమ్ టైమ్ స్కేల్ వర్తింప జేయడానికి గల సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేయడానికి, పీఎఫ్ అమలు చేయడానికి, జాబ్ చార్ట్ తయారు చేయడానికి, సమగ్ర శిక్షా ఉద్యోగ నియామకాల్లో వీరికి వెయిటేజీ ఇవ్వడానికి, గత అవకాశాలను పరిశీలించడానికి కమిటీలు వేయడానికి అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈలోపు ఎన్నికలు రావడంతో ఆ మినిట్స్ అమలు కాలేదు. ఎన్నికల సమయంలో చంద్రబాబు, లోకేష్ వీరి డిమాండ్లు సమంజసమైనవేనని వాటిని తమ ప్రభుత్వం వచ్చిన తరువాత తప్పకుండా పరిష్కరిస్తామని స్పష్టమైన హామీని కూడా ఇచ్చినట్టు సమగ్ర శిక్షా కాంట్రాక్ట్ ఉద్యోగులు గుర్తు చేస్తున్నారు. ప్రభుత్వం ఆమోదించిన మినిట్స్‌ను అమలు చేయాలని అప్పట్లో నారా లోకేష్ తన ట్విట్టర్ అకౌంట్‌లో సైతం ట్వీట్ చేసి సమగ్రశిక్ష ఉద్యోగులను ఆకర్షించారు. ఇదిలా ఉండగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు గడిచినా ఇప్పటివరకూ తమ సమస్యలు పరిష్కరించే దిశగా ప్రభుత్వం చొరవ తీసుకోకపోవడం దారుణమని సమగ్ర శిక్ష ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


Lokesh Nara
@naralokesh
Translate post
గత ఆరు రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ నిర్లక్ష్యం వహించడం శోచనీయం. మినిమమ్ టైం స్కేల్ విషయంలో జీవోల మీద జీవోలు ఇచ్చి అమలు చేయకపోవడం, ఉద్యోగుల మధ్య విభేదాలు సృష్టించే చర్యలకు పాల్పడటం దారుణం. సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు చేస్తున్న ఆందోళనకు తెలుగుదేశం పార్టీ సంఘీభావం తెలియజేస్తోంది. సమగ్ర శిక్షా ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలి.

గతంలో నారా లోకేష్ చేసిన ట్వీట్

### సమ్మెకు వెనకాడబోం



గత ప్రభుత్వం ఆమోదించిన మినిట్స్ తాము అధికారంలోకి వస్తే అమలు చేస్తామని లోకేష్ హామీ ఇచ్చారు. కానీ ఇప్పటివరకూ ఆయన స్పందించకపోవడం దారుణం. అక్టోబర్ 12లోపు మా డిమాండ్లు పరిష్కరించకపోతే విజయవాడలో జరిగే ఆవిర్భావ సభలో సమ్మెకు కార్యాచరణ రూపొందిస్తాం.

– వాసా శ్రీనివాసరావు, సమగ్ర శిక్షా ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర చైర్మన్

### ఉద్యోగ భద్రత కల్పించాలి



సమగ్ర శిక్షాలో పని చేస్తున్న అన్ని విభాగాల కాంట్రాక్టు ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలి. మా పని వేళలు, బాధ్యతలకు సంబంధించి స్పష్టత లేకపోవడం వల్ల సమస్యలు తలెత్తుతున్నాయి. కచ్చితమైన జాబ్ చార్ట్, పని సమయాలపై మార్గదర్శకాలు జారీ చేయాలి. హెచ్‌ఆర్ పాలసీ, పీఎఫ్ వర్తింపజేయాలి.

– వినోద్, సమగ్ర శిక్షా ఉద్యోగుల జిల్లా అధ్యక్షుడు

### భవానీలు.. బీ కేర్‌ఫుల్



ద్వారకాతిరుమల చినవెంకన్న క్షేత్రానికి వచ్చే కొందరు భవానీ దీక్షదారులు ప్రమాదకర ప్రయాణాలు సాగిస్తున్నారు. వాహనాలపై పరిమితికి మించి ప్రయాణిస్తూ ఆందోళన కలిగిస్తున్నారు. శనివారం ఒక్కో బైక్‌పై నలుగురు, ఐదుగురు చొప్పున ప్రయాణిస్తూ ఇలా కనిపించారు. ఏ మాత్రం పట్టు తప్పినా పెను ప్రమాదం తప్పదని స్థానికులు అంటున్నారు.

– ద్వారకాతిరుమల

## క్లుప్తంగా

### సబ్సిడీ గ్యాస్ సిలిండర్ల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న గ్యాస్ సిలిండర్లతో విజిలెన్స్, రెవెన్యూ అధికారులు

**తణుకు అర్బన్:** స్థానిక ప్రసాద్ థియేటర్ సమీపంలోని జీఎంఆర్ సిద్దేశ్వర్ కిరాణా దుకాణంలో శనివారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు నిర్వహించారు. బ్లాక్ మార్కెట్‌లో విక్రయించేందుకు అక్రమంగా నిల్వ ఉంచిన 9 గృహ అవసరాల గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నట్లు విజిలెన్స్ ఎస్సై కె.సీతారామ్ తెలిపారు. దుకాణ యజమాని గుడివాడ వాసవి దుర్గ రామ వెంకట నరసింహ గుప్తాపై నిత్యావసర వస్తువుల చట్టం 1955 ప్రకారం కేసు నమోదు చేశామన్నారు. ఈ దాడుల్లో విజిలెన్స్ అగ్రికల్చర్ ఆఫీసర్ ఎ.మీరయ్య, తహసీల్దార్ బి.కన్యాకుమారి, తణుకు సీఎస్‌డీటీ ఎస్.శ్రీదేవి, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

### జిల్లా టీచర్ల విభాగం అధ్యక్షుడిగా పితాని మురళి



**పాలకొల్లు సెంట్రల్:** వైఎస్సార్ సీపీ పశ్చిమగోదావరి జిల్లా టీచర్ల విభాగం అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన పితాని రామకృష్ణ (మురళి)ని నియమించారు. ఈ సందర్భంగా శనివారం పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల ప్రకారం పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఆదేశాలు అందాయి.

# జూనోటిక్ వ్యాధుల రక్షణ ఇలా..

**జంగారెడ్డిగూడెం:** రేబిస్ అనేది ఒక ప్రాణాంతక జూనోటిక్ వ్యాధి. అంటే ఇది జంతువుల నుంచి మనుషులకు సంక్రమిస్తుంది. ముఖ్యంగా కుక్కలు, పిల్లుల్లో రేబిస్ వైరస్ కారణమవుతుంది. ఈ వ్యాధి ఎన్‌సెఫాలైటిస్ (గుర్తింపు లోపం), మానసిక స్థితి మార్పులకు దారితీస్తుంది. ఇది చివరకు ప్రాణాంతకం అవుతుంది. సెప్టెంబర్ 28న ప్రపంచ రేబిస్ దినోత్సవం సందర్భంగా రేబిస్ వ్యాప్తి, నివారణ చర్యలపై కథనం.

### రేబిస్ వ్యాధి వ్యాప్తి

- రేబిస్ వ్యాధి ప్రధానంగా వైరస్ సోకిన జంతువుల గోరు, దంతాలు లేదా ముక్కు ద్వారా వ్యాపిస్తుంది.
- కుక్కలు, పిల్లులు లేదా ఇతర రేబిస్–సోకిన వన్య జంతువులు కరిచినప్పుడు రేబిస్ వ్యాధి వ్యాప్తి చెందుతుంది.
- రక్తంలోకి రేబిస్ వైరస్ ప్రవేశించి, నాడీ వ్యవస్థ ద్వారా మెదడుకు చేరి తీవ్ర నాడీ సంబంధిత రుగ్మతలను కలిగిస్తుంది.

### ఇతర పశువుల్లో...

- మేత తినకపోవడం, డిప్రెషన్, డల్‌నెస్, కనుపాప పెద్దదవడం, కళ్ల వెంబడి నీరు కారడం, చొంగ, కదలికలో మార్పు, నడవలేకపోవడం, పక్షవాతం, చిక్కిపోవడం, మరణాలు సంభవిస్తాయి.

**తీసుకోవాల్సిన జాగ్రత్తలు**

- కుక్క కాటు లేదా గాయానికి వెంటనే నీటితో, సబ్బుతో శుభ్రంగా కడగాలి.
- యాంటీసెప్టిక్ లేదా ఆల్కహాల్ ఉపయోగించి కాటు ప్రాంతాన్ని శుభ్రపరచాలి.
- కాటు లేదా గాయానికి వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. రేబిస్ వ్యాధి గురించి ఖచ్చితమైన నిర్ధారణ కోసం వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలి.
- రేబిస్ వ్యాధి సోకిన గాయాల తర్వాత వెంటనే పీఈపీ (పోస్ట్ ఎక్స్‌పోజర్ ప్రోఫీలాక్సిస్) టీకాలు ఇవ్వడం ద్వారా రక్షణ పొందవచ్చు.



- ఒకసారి కాటు గాయం జరిగిన తర్వాత 0వ రోజు, 3వ రోజు, 7వ రోజు, 14వ రోజు, 28వ రోజు టీకాలు వేయించాలి.
- రేబిస్ వ్యాధి సోకకుండా ముందస్తు రక్షణ కోసం ప్రీ ఎక్స్‌పోజర్ వ్యాక్సిన్ వేయించుకోవడం ఉత్తమం. ముఖ్యంగా జంతువులతో ఎక్కువగా పని చేసే వాళ్లకు అత్యవసరం.

### పెంపుడు జంతువులకు చేయవలసిన చర్యలు

- పెంపుడు కుక్కలు, పిల్లులకు రేబిస్ వ్యాధికి వ్యతిరేకంగా టీకాలు వేయించడం అత్యంత అవసరం.
- చిన్న వయస్సులోనే (తొలకరి నెల) రేబిస్ టీకా మొదలవుతుంది. తరువాత ప్రతి సంవత్సరం టీకాలు వేయించాలి.
- జంతువులకు బాహ్య, అంతర్గత పరాన్నజీవాలను నివారించడానికి యాంటీ–పరాన్నజీవా మందులు ఇవ్వాలి.
- కీటకాలు, ఫ్లీస్, టిక్స్ వంటి జీవులను పర్యవేక్షించాలి.

### రేబిస్ వ్యాప్తిని నిరోధించాలి



రేబిస్ అనేది ప్రాణాంతకమైన వ్యాధి. కుక్కలు, పిల్లుల విషయంలో జాగ్రత్తలు తీసుకోవడం, టీకాలు వేయించడం చాలా ముఖ్యం. కాటు సంభవించినప్పుడు వెంటనే వైద్యుడిని సంప్రదించి రేబిస్ వ్యాధి వ్యాప్తిని నిరోధించడం చాలా అవసరం.

– టీఆర్ శ్రీనివాసన్, పశువైద్యాధికారి

### రేబిస్ లక్షణాలు

వ్యాధి లక్షణాలు 14 రోజుల నుంచి ఏడాదిలోపు బయటపడతాయి. ఇది కుక్క కరిచిన ప్రదేశాన్ని బట్టి ఉంటుంది. మనుషులలో వ్యాధి లక్షణాలు రెండు రకాలుగా ఉంటాయి. అవి ప్యారలైటిక్, హైడ్రో ఫోబియా. 80 శాతం కేసుల్లో హైడ్రోఫోబియా లక్షణాలు ఉంటాయి. వీటిలో మనుషులు నీటిని చూసి భయపడటం, కరిచిన చోట జిలగా ఉండటం, గట్టిగా గాలివీచినా, వెలుగు పడినా భయపడుతుండటం కనిపిస్తాయి. ఈ లక్షణాలు కనిపిస్తే 3 నుంచి 5 రోజులు మాత్రమే జీవిస్తారు. ప్యారలైటిక్‌ఫాంలో నీటిని చూసి భయపడటం ఉండదు. గొంతు పడిపోవడం, పక్షవాతం లక్షణాలు కనిపిస్తాయి. ఇక కుక్కల్లో ప్యూరియస్ ఫాం, డంబ్ ఫాం లక్షణాలు ఉంటాయి. ప్యూరియస్ ఫాంలో మేత తినకపోవడం, జ్వరంతో బాధపడటం, పరివర్తనలో మార్పు రావడం, చీకటిలో దాగడం, పరుగులు తీయడం, మనుషులను కరవడానికి ప్రయత్నించడం, వస్తువులను కరవడం, అరుపులో మార్పులు రావడం, చొంగలు కార్చడం, ఏ వస్తువునంటే వాటిని తీసుకుని నోట్లో పెట్టుకోవడం, కదలికలో తేడాలు, కాళ్లకు పక్షవాతం, మరణాలు సంభవిస్తాయి. డంబ్‌ఫాంలో దవడ కిందకు జారడం, పక్షవాతం, కోమా, మరణం 10 రోజుల లోపు సంభవిస్తుంది.

# రసాయన మందుల పిచికారీలో జాగ్రత్తలు



పలగాని చెన్నారావు, వ్యవసాయాధికారి

**నూజివీడు:** పంటలకు ఆశించే తెగుళ్ల నివారణకు రైతులు పురుగుమందులు వాడతారు. రసాయన మందులు విషపూరితమైనవి కావడం వల్ల వీటిని పంటలకు పిచికారీ చేసేటపుడు జాగ్రత్తలు పాటించాలి. వరి, మొక్కజొన్న, మినుము, పెసర, కూరగాయలు తదితర పంటలకు క్రిమిసంహారక మందులను పిచికారీ చేసేటప్పుడు ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రాణపాయం సంభవించే ప్రమాదం ఉంది. అలాగే మామిడి సీజన్‌లో రైతులు పూత రావడం దగ్గర నుంచి పిందె దశ వరకు విడతలు వారీగా రసాయన మందులను పిచికారీ చేస్తుంటారు. ఈ నేపథ్యంలో పురుగు మందులను పిచికారీ చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వ్యవసాయాధికారి పలగాని చెన్నారావు పలు సూచనలు చేశారు.

పాడి–పంట

**పాటించాల్సిన జాగ్రత్తలు**

- పురుగుమందులను పిచికారీ చేసేటప్పుడు వ్యక్తి ముఖానికి మందంగా ఉండే కండువా లేదా మాస్క్‌ను ధరించాలి.
- చేతులకు గ్లౌజ్, కాళ్లకు పొడవాటి దళసరి బూట్లు వేసుకోవాలి. నిండుగా దుస్తులు ధరించాలి.
- పురుగు మందులను పిచికారీ చేసిన తరువాత మందు డబ్బాలను భూమిలో పాతిపెట్టాలి. చేతులను శుభ్రంగా రెండుసార్లు సబ్బుతో కడుక్కోవాలి.
- ఏ పంటకు ఎంత మోతాదులో పిచికారీ చేయాలో సంబంధిత అధికారులను గానీ, శాస్త్రవేత్తలను గానీ అడిగి తెలుసుకోవాలి.
- కళ్ల మంట పుట్టడం, దురద పుట్టడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఉన్నా నిర్లక్ష్యం వహించకుండా వైద్యుడిని సంప్రదించాలి.



ఇది సరైన పద్ధతి కాదు: ముఖానికి మాస్క్ లేకుండా పురుగు మందు పిచికారీ చేస్తున్న దృశ్యం (ఫైల్)

- పురుగుమందుని నీటితో కలిపేటప్పుడు చేతిని కాకుండా కర్రను ఉపయోగించి కలపాలి
- పురుగు మందు డబ్బాల మూతను నోటితో తీయకూడదు.
- మందును పిచికారీ చేసిన చేతులతో బీడీ, సిగరెట్, చుట్ట తాగకూడదు.
- పురుగు మందులను మధ్యాహ్న సమయంలో పిచికారీ చేయకూడదు.
- గాలికి ఎదురుగా పురుగు మందులను పిచికారీ చేయకూడదు. అలా చేయడం వల్ల మందు మొక్కలపై పడకుండా పిచికారీ చేసే వ్యక్తిపైనే పడుతుంది.
- ఒకే వ్యక్తి ఎక్కువ విస్తీర్ణానికి మందులను పిచికారీ చేయకూడదు.
- పురుగు మందులను వేర్వేరుగానే పిచికారీ చేయాలి. ఒక పురుగు మందుని, కలుపు మందుతో కలపకూడదు. తెగులు మందుని, కలుపు మందుని కలపకూడదు.
- పురుగు మందులు శరీరంలోకి స్పర్శ, శ్వాస లేదా నోటి ద్వారా ప్రవేశించే ప్రమాదం ఉంది.
- పురుగు మందులను పిచికారీ చేసేటప్పుడు పురుగుమందు ప్యాకెట్‌పైన, పాంప్లెట్‌పైన ముద్రించిన సూచనలను చదివి పాటించాలి.



### కమ్యూనిటీ సైన్స్ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం



డాక్టర్ ఎస్ దెబోరా మెస్సియానా, హోంసైన్స్ శాస్త్రవేత్త, కేవీకే

**ఉండి:** కమ్యూనిటీ సైన్స్ (హోం సైన్స్) కోర్సులో ప్రవేశానికి ఈనెల 30వ తేదీ వరకు మాత్రమే గడువు ఉందని ఎన్నార్సీ అగ్రహారం కృషీ విజ్ఞాన కేంద్రం హోంసైన్స్ శాస్త్రవేత్త డాక్టర్ ఎస్ దెబోరా మెస్సియానా ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగేళ్ల కాలపరిమితి గల ఈ డిగ్రీ కోర్సును బీఎస్సీ ఆనర్స్‌గా పిలుస్తున్నారని, ఇందులో చేరేందుకు ఇంటర్ బైపీసీ, ఎంపీసీ ఉత్తీర్ణులైన విద్యార్థులు, 3 ఏళ్ల హోంసైన్స్, అగ్రికల్చర్ డిప్లమో గ్రూపులో పాసైన విద్యార్థులు అర్హులన్నారు. ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కమ్యూనిటీ సైన్స్ కోర్సులో చేరి విద్యార్థులు తమ భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. అభ్యర్థులు ఏఎన్‌జీఆర్‌ఏయూ.ఏసీ.ఇన్ అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

### బాలకృష్ణది కొవ్వెక్కిన భాష

- అసెంబ్లీ సాక్షిగా చిరంజీవికి క్షమాపణ చెప్పాలి
- జనసేన అధికార ప్రతినిధి సజ్జా సుబ్బు

**తాడేపల్లిగూడెం:** బాలకృష్ణ చిరంజీవిని వాడు వీడు అని మాట్లాడటం ఎంత కొవ్వెక్కిన భాష.. ఈ విషయంలో బాలకృష్ణ చిరంజీవికి అసెంబ్లీ సాక్షిగా బేషరతుగా క్షమాపణ చెప్పాలి.. అంటూ జనసేన అధికార ప్రతినిధి సజ్జా సుబ్బు డిమాండ్ చేశారు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. అసెంబ్లీలో బాలకృష్ణ చిరంజీవిపై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ప్రజలంతా చూస్తున్న రికార్డెడ్ ప్రోగ్రాంలో బాలకృష్ణ ఇలా మాట్లాడటం సరికాదన్నారు. బాలకృష్ణ అసలు చిరంజీవి గురించి ప్రస్తావించకూడదన్నారు. కొవ్వెక్కిన భాషను బాలకృష్ణ వాడారన్నారు. జనసేన పార్టీ కూటమిలో ఉన్నందున చిరంజీవి వేరు, పవన్ వేరని బాలకృష్ణ అనుకుంటున్నట్టున్నారని చెప్పారు. చిరంజీవి గురించి బాలకృష్ణ అవాకులు, చవాకులు పేలితే ఆయన అసలు అసెంబ్లీకి రాకపోదురేమో అనిపిస్తోందన్నారు. ఈ విషయంలో జనసేన చాలా సీరియస్‌గా ఉందన్నారు. బాలకృష్ణ అసెంబ్లీ సాక్షిగా చిరంజీవిపై చేసిన వ్యాఖ్యల విషయంలో క్షమాపణ చెప్పాల్సిందేనని స్పష్టం చేశారు.

### వచ్చే ఎన్నికల్లో పోటీ చేయను: ఎమ్మెల్యే బొలిశెట్టి

**తాడేపల్లిగూడెం:** వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తాను పోటీ చేయనని ప్రభుత్వ విప్, పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఒక వెబ్ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో స్పష్టం చేశారు. రాజకీయాల్లో అలసిపోయానని, వచ్చే ఎన్నికల్లో పోటీ చేయనని తెలిపారు. వ్యవసాయం చేసుకుంటానన్నారు. జనసేనలో అంతర్గత ప్రజాస్వామ్యం లేదన్నారు. ప్రజాసేవ చేయాలనే ఆకాంక్ష ఉన్నవారికి మద్దతు ఇస్తానని చెప్పారు. ప్రస్తుతం ఆయన చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

### నీట మునిగి కుళ్లుతున్న వరి



ముంపునకు గురైన పొలాల్లో తామర పువ్వులు విరిసిన దృశ్యం

**ఆకివీడు:** ఖరీఫ్ పంట సాగుకు మళ్లీ ముంపు బెడద తప్పడంలేదు. ఇటీవల కురిసిన వర్షానికి పలు గ్రామాల్లోని పల్లపు ప్రాంతాల్లోని పంట నీట మునిగింది. కొల్లేరు తీరంలోనూ, ఉప్పుటేరు, వెంకయ్య వయ్యేరు పంట కాల్వకు చేర్చి, చిన కాపవరం డ్రెయిన్ ప్రాంత ఆయుకట్టు ముంపునకు గురవుతోంది. మండలంలో అధికారిక లెక్కల ప్రకారం 250 ఎకరాల్లో పంట పూర్తిగా నీట మునిగి పనికిరాకుండా పోయింది. ఇప్పటికే ఉప్పుటేరు గుండా ముంపు నీరు భారీగా సముద్రంలోకి చొచ్చుకుపోతోంది. ఉప్పుటేరులో రైల్వే ఖానాల వద్ద, బైపాస్ వంతెన నిర్మాణం వద్ద మేటలు వేయడంతో నీటి ప్రవాహానికి కొంత ఇబ్బంది కరంగా ఉంది. ముంపు తీవ్రత అధికంగా ఉంటే మండలంలోని పలు గ్రామాల్లో వరి పంట నీట మునిగే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

### శ్రీవారి క్షేత్రం.. భక్తజన సంద్రం



తూర్పు రాజగోపుర ప్రాంతంలో భక్తుల సందడి

**ద్వారకాతిరుమల:** చినవెంకన్న దర్శనంతో భక్తజనమది పులకించింది. శ్రీవారికి ప్రీతికరమైన రోజు కావడంతో శనివారం వేలాది మంది భక్తులు ఆలయానికి తరలివచ్చారు. అలాగే దసరా ఉత్సవాల సందర్భంగా విజయవాడ కనక దుర్గమ్మను దర్శిస్తున్న వివిధ ప్రాంతాలకు చెందిన భవానీ దీక్షాదారులు, తిరుగు ప్రయాణంలో పెద్ద ఎత్తున ఈ క్షేత్రానికి విచ్చేశారు. దాంతో కొండపైన, ఆలయ పరిసరాలు కళకళలాడాయి. స్వామి దర్శనం తరువాత ఉచిత ప్రసాదాన్ని స్వీకరించిన భక్తులు, ఆలయ తూర్పు రాజగోపుర ప్రాంతంలోకి చేరుకుని సెల్ఫీలు, ఫొటోలు దిగి సందడి చేశారు. అనివేటి మండపంలో పలు భజన మండలి సభ్యులు ప్రదర్శించిన కోలాట నత్యాలు చూపరులను అలరించాయి. సాయంత్రం వరకు క్షేత్రంలో భక్తుల రద్దీ కొనసాగింది.

# తణుకులో భారీ చోరీ

**వృద్ధురాలిని భయపెట్టి 70 కాసుల బంగారు ఆభరణాల అపహరణ**

**తణుకు అర్బన్:** ఒంటరిగా నివసిస్తున్న వృద్ధురాలి ఇంట్లోకి చొరబడి బంగారు ఆభరణాలు దోచుకున్న ఘటన తణుకులో సంచలనం రేకెత్తించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... తణుకు లయన్స్ క్లబ్ ప్రాంతంలోని వారణాసి వారి వీధిలో నివసిస్తున్న వాకలపూడి కనకదుర్గ ఇంట్లోకి శుక్రవారం రాత్రి సుమారు 2 గంటల సమయంలో ప్రవేశించిన దొంగలు సుమారుగా 70 కాసుల బంగారు ఆభరణాలు, రూ.70 వేలు నగదు దోచుకున్నారు. నోరెత్తితే చంపేస్తామని బెదిరించిన దొంగలను చూసి హడలెత్తిపోయిన వృద్ధురాలు వారికి సహకరించాల్సిన దుస్థితి నెలకొంది. వృద్ధురాలి భర్త మాజీ కౌన్సిలర్ వాకలపూడి వీరరాఘవులు గతంలోనే మృతిచెందగా కుమారులు ఇతర దేశాల్లో ఉద్యోగాలు చేసుకుంటున్నారు. ఇంట్లో ఎవరూ లేరనే పక్కా సమాచారంతో ఇంట్లోకి ప్రవేశించిన దొంగలు వృద్ధురాలిని భయభ్రాంతులకు గురిచేసి అందినకాడికి దోచుకుపోయారు. ఇంటి వెనుక భాగం నుంచి లోపలకు దొంగలు వచ్చారని, చోరీలో నలుగురు దుండగులు ఉన్నట్లుగా బాధితవర్గాలు చెబుతున్నారు. తెల్లవారుజామున పోలీసులకు బాధితురాలు సమాచారం ఇవ్వడంతో తాడేపల్లిగూడెం డీఎస్పీ డి.విశ్వనాథ్ హుటాహుటిన వచ్చి ఘటనా ప్రాంతాన్ని పరిశీలించారు. తణుకు పట్టణ సీఐ ఎస్.కొండయ్యకు కేసు దర్యాప్తుపై పలు సూచనలు చేశారు.



తణుకులో చోరీ జరిగిన ఇల్లు

### నిందితులు పాత నేరస్తులేనా?



పోలీసులు విడుదల చేసిన నిందితుడి ఫొటో

చోరీకి గురైన నివాసంలో దొరికిన ఆనవాళ్లతోపాటు సమీపంలోని సీసీ కెమేరాల పుటేజీల ప్రకారం నిందితులను పోలీసు అధికారులు గుర్తించినట్లుగా తెలుస్తోంది. భీమవరం జిల్లా పోలీసు కార్యాలయం నుంచి నిందితుడి ఫొటోతోపాటు వారి వివరాలు విడుదల చేశారు. పాత నేరస్తుడైన ఉత్తరప్రదేశ్‌కు చెందిన నాగేంద్ర సహని, మహారాష్ట్రకు చెందిన సందీప్ మీరా రామ్ నేరానికి పాల్పడ్డారని, వీరు తెలుపు రంగు కారులో వచ్చి చోరీ సొత్తుతో అదే కారులో ఉడాయించారని వివరించారు. సదరు దొంగలకు సంబంధించిన వివరాలు తెలిస్తే సమాచారం ఇవ్వాల్సిందిగా పోలీసులు కోరుతున్నారు. సీఐ కొండయ్య కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

# క్లుప్తంగా

## ఆహారపు అలవాట్లపై అవగాహన



తల్లులకు ఆహారపు అలవాట్లపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ శ్రీదేవి

**అత్తిలి:** పోషణ మహోత్సవాల్లో భాగంగా శనివారం అత్తిలి మండలం బల్లిపాడు గ్రామంలో తల్లులకు, పిల్లలకు ఆహారపు అలవాట్ల మార్పులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఐసీడీఎస్ తిరుపతిపురం సెక్టార్ పర్యవేక్షకురాలు ఎం శ్రీదేవి అవగాహన కల్పించారు. ప్రధానమంత్రి మాతృత్వ యోజన పథకంపై అవగాహన కల్పించారు. అర్హులైన గర్భిణుల వివరాలను నమోదు చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.

## వరాల వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



విశేష అలంకరణలో వరాల వేంకటేశ్వరస్వామి

**అత్తిలి:** మండలంలోని ఈడూరు గ్రామంలో వేంచేసియున్న వరాల వెంకటేశ్వరస్వామికి శనివారం విశేష పూజలు జరిపారు. వేకువజామున స్వామి వారికి సుప్రభాత సేవ, తోమాల సేవ, ఉదయం అర్చనలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో పూజాదికాలను జరిపారు. పరిసర గ్రామాల నుంచి వేల సంఖ్యలో భక్తులు హాజరై ఏడు ప్రదక్షిణలు చేసి, స్వామివారిని దర్శించుకున్నారు. రాత్రి ఊంజల్ సేవ జరిపారు. హాజరైన భక్తులకు అన్నదానం నిర్వహించారు.

## చోరీ ముఠాపై అప్రమత్తంగా ఉండాలి

**ఆకివీడు:** మండలంలో చోరీ ముఠా సంచరించే ప్రమాదం ఉందని ఆకివీడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వి.జగదీశ్వరరావు చెప్పారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజస్థాన్, మధ్యప్రదేశ్‌కు చెందిన ఆరుగురు వ్యక్తుల ముఠా దొంగతనాలకు పాల్పడుతున్నట్లు చెప్పారు. తక్కువ ఛార్జీలు ఉన్న లాడ్జిల్లో వీరు దిగి ఆయా ప్రాంతాల్లో రాత్రిపూట దొంగతనాలకు పాల్పడుతున్నట్లు చెప్పారు. ఇటీవల తణుకు ప్రాంతంలో దొంగతనానికి పాల్పడ్డారన్నారు. అనుమానాస్పద వ్యక్తులు కన్పిస్తే వెంటనే 112కి ఫోన్ చేయాలన్నారు. ఇంట్లో ఉన్న విలువైన వస్తువులు బ్యాంకు లాకర్లలో దాచుకోవాలన్నారు. అపరిచితులను గుర్తిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు.

## గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి

**ఉండి:** గర్భిణులు పోషహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలని ఐసీడీఎస్, వైద్యాధికారులు తెలిపారు. శనివారం కోలమూరులో స్వస్థ్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పేరిచర్ల సుభాష్‌రాజు మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే ఇల్లంతా, ఇంట్లోనివారంతా ఆరోగ్యంగా ఉంటారన్నారు. యర్రా విక్రమ్, గాదిరాజు వెంకటేశ్వరరాజు, కొమ్మన సత్యనారాయణ, మడిచర్ల సూర్యప్రకాష్, గాజుల శివ పాల్గొన్నారు.

## 3న వంతెనలకు అప్రోచ్‌ల కోసం ధర్నా

**భీమవరం అర్బన్:** అక్టోబర్ 3న సీపీఎం ఆధ్వర్యంలో యనమదుర్రు డ్రెయిన్‌పై నిర్మించిన వంతెనలకు అప్రోచ్ రోడ్లు ఏర్పాటు చేయాలంటూ తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతామని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడే ఇంజేటి శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 29 నుంచి ధర్నాను విజయవంతం చేయాలని ప్రచారం చేస్తామని పేర్కొన్నారు.

## విద్యార్థులు లక్ష్యాన్ని ఏర్పరుచుకోవాలి



మెరిట్ విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న చైర్మన్ గ్రంధి సత్యనారాయణ

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** స్థానిక శ్రీ వాసవి జీఎంఆర్ జూనియర్ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. కొత్తగా వచ్చిన జూనియర్లకు సీనియర్‌లు స్వాగతం పలికారు. విద్యాభ్యాసంలో ఎదురైన సమస్యలు, అధ్యాపకుల శిక్షణ, ప్రోత్సాహం, క్రమశిక్షణలపై సీనియర్లు అవగాహన చేశారు. కళాశాల చైర్మన్ గ్రంధి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఖచ్చితంగా ఒక లక్ష్యాన్ని ఏర్పరుచుకోవాలని, నిరంతరం శ్రమ చేయాలని పలు సూచనలు చేశారు. సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ వీవీఎస్ లక్ష్మీనారాయణ, కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.సత్యనారాయణ, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వీఎస్ఎస్ శ్రీనివాస్‌లు హాజరై మాట్లాడారు. సీనియర్ టాపర్స్‌కు బహుమతులు అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి.

# జగనన్న కాలనీలో మౌలిక వసతులు కరువు

- ఇబ్బందులు పడుతున్న కాలనీ వాసులు
- చిన్న వర్షానికే చిత్తడిగా మారుతున్న రహదారులు
- వర్షపునీరు, మురుగునీరు ఏకమై దుర్వాసన వస్తున్న వైనం
- కొద్దిరోజులుగా నీటిలోనే మగ్గుతున్న గృహాలు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



ఇరగవరం జగనన్న కాలనీల్లో నిలిచిపోయిన మురుగు నీరు



జగనన్న కాలనీలో రోడ్డు లేని దృశ్యం

**ఇరగవరం:** అసలే వర్షాకాలం ఆపై వ్యాధులు ప్రబలడంతో, దీనికితోడు వర్షాలతో గత కొన్నిరోజులుగా ఇరగవరం మండలంలోని జగనన్న కాలనీలో ప్రజలు నానా అవస్థలుపడుతున్నారు. మండలంలో వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్నప్పుడు మండ ల కేంద్రమైన ఇరగవరం మండలంలోని ఇరగవరం, రేలంగి, కావలిపురం, పద్దిరెడ్డి పాలెం, పేకేరు, కంతే రు, కాకిలేరు, అయితంపూడి ఏలేటిపాడు, అన్ని గ్రామాల్లో జగనన్న కాలనీలు ఎంతో గొప్పగా ప్రారంభమయాయ్యి. చాలాచోట్ల ఇళ్లను పూర్తి చేశా రు. అయితే జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయా లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ కాలనీలో సరైన రహదారులు లేకపోవడంవల్ల కొద్దిపాటి వర్షం కురిసినా పడుతున్న అవస్థలు అన్నీ, ఇన్నీ కావు. డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ఇళ్లల్లోని వృధానీరు ఎటూ పోయే మార్గంలేక వర్షపు నీరు ఏకమై రహదారులు చెరువులను తలపిస్తున్నాయి. సుమారు 200కుటుంబాలకు పైగా ఈ కాలనీలో నివాసం ఉంటున్నాయి. కాలనీలో మౌలికవసతులు కల్పించాలని పంచాయతీ అధికారులకు విన్నవించుకున్నారు. అయినప్పటికీ ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. ద్విచక్ర వాహనాలు మొరాయించి మరమ్మతులకు గురవుతున్నాయి.

**వర్షాకాలంలో ఇదే తంతు**

వర్షాకాలం వచ్చినప్పుడల్లా స్థానికులకు ఈ కష్టాలు తప్పడంలేదు. కనీసం కచ్చా డ్రెయినేజీ వ్యవస్థ కల్పించడంలో అధికారులు అశ్రద్ధ కొరవడింది. ఎన్నికల సమయంలో రహదారులు, మురుగు కాల్వల నిర్మాణాలు చేపడతామని హామీ ఇచ్చినా ఇప్పటి వరకు పట్టించుకొనే నాథుడు కరువయ్యాడు. గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. నీరు నిల్వ ఉండడంతో దోమలు వ్యాప్తి చెందిన ప్రజలు జ్వరాలతో బాధపడుతున్నారు. పంచాయతీ అధికారులు కనీసం బ్లీచింగ్, సున్నం చల్లడం లేదని వాపోతున్నారు. కాలనీలో రహదారులు సైతం నీటిలో మునిగిపోవడం వల్ల పాములు ఇళ్లల్లోకి ప్రవేశిస్తున్నాయని కాలనీ వాసులు వాపోతున్నారు. అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని కాలనీ వాసులు ముక్త కంఠంతో కోరుతున్నారు.

### జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించండి



జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వంలో ఇచ్చిన జగనన్న కాలనీలను ప్రస్తుత కూటమి ప్రభుత్వం పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తోంది. దీంతో జగనన్న కాలనీ వాసులకు తీవ్ర ఇబ్బందులు తప్పడంలేదు. కనీస మౌలిక సదుపాయాలు లేకపోవడంతో ప్రజలు, చిన్న పిల్లలు, వృద్ధులు మురుగు నీటిలోనే ప్రయాణం చేస్తున్నారు. ప్రభుత్వం పట్టించుకుని సమస్యలు పరిష్కారించాలి లేకపోతే ప్రజల తరపున పోరాటాలు చేస్తామన్నారు.

– తామరపల్లి మునలియ్య, అర్జునుడుపాలెం శివారు, పద్దిరెడ్డిపాలెం

## బీసీ వెల్ఫేర్ జీవోను సరిచేయాలి

- శాసనమండలిలో ఎమ్మెల్సీ రవీంద్రనాథ్



ఎమ్మెల్సీ రవీంద్రనాథ్

**తణుకు అర్బన్:** బీసీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ శాఖ ఇటీవల విడుదల చేసిన జీవో వివాదాలు, మనస్పర్థలకు దారి తీసే అవకాశం ఉందని, ప్రభుత్వం ముందుగా సరి చేసుకుంటే అనవసర సమస్యలు రాకుండా ఉంటాయని శాసన మండలి సభ్యులు వంకా రవీంద్రనాథ్ శనివారం శాసన మండలిలో ప్రస్తావించారు. దొమ్మరి కులం వారు తమ కుల పేరు ప్రస్తావన సమాజంలో గౌరవప్రదంగా లేదని, దొమ్మరోడా, దొమ్మెరోడి విలా ఉన్నావు అని సమాజంలోను, చిత్ర పరిశ్రమలో అనడం మూలంగా వారి మనసులు నొచ్చుకుంటున్నాయని స్పష్టం చేశారు. అందుకోసం వారి కులం పేరును దొమ్మర (గిరి బలిజ)గా పేరు మారుస్తూ జీవో చేయడం బలిజ కుల ప్రజలు తీవ్ర అభ్యంతరం చెపుతున్నారన్నారు. పేరు మార్చాలంటే ఏదైనా కొత్త పేరు పెట్టాలేకానీ, దొమ్మరి అనే పేరు తీయకుండా బ్రాకెట్‌లో గిరి బలిజ అని పేరు జత చేయడాన్ని వారు కూడా స్వాగతించడంలేదని స్పష్టం చేశారు. ప్రత్యేక చారిత్రిక నేపథ్యం ఉన్న బలిజ పేరును వేరే కులానికి పెట్టడం ఎంతమాత్రం సరికాదని, గిరి దొర, గిరి నాయక అని పేరు పెట్టి వారిని గౌరవించాలే కానీ, సంప్రదాయాలకు సంబంధంలేని కులానికి కాపు, బలిజ కులం పేరుతో పిలవడం సరికాదని వెల్లడించారు. ప్రభుత్వం వెంటనే జీవోని సరిచేసి ఎవరి మనోభావాలు దెబ్బతినకుండా చూడాలన్నారు.

## మహిళా ఆరోగ్యంతోనే కుటుంబ ఆరోగ్యం



బల్లిపాడు వైద్యశిబిరంలో ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యులు, ప్రజా ప్రతినిధులు

**అత్తిలి:** మహిళా ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందని అత్తిలి పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ ఆర్ సురేఖ అన్నారు. శనివారం అత్తిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో బల్లిపాడు గ్రామ సచివాలయం వద్ద స్వస్థ్ నారీ సశక్త పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి సురేఖ మాట్లాడుతూ మహిళలు, కిశోర బాలికలకు స్క్రీనింగ్, రక్తపోటు, క్యాన్సర్, రక్తహీనత, క్షయ, ఎనీమియా, గర్భిణులకు ప్రసూతి పరీక్షలు, పిల్లలకు టీకాలు, ప్రధాన మంత్రి మాతృత్వ వందన యోజన పథకం కింద నిర్వహించే వివిధ పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వ్యాధులను తొలి దశలో గుర్తించి మందులతో నివారణ పొందవచ్చునని తెలిపారు. ఈసందర్భంగా శిబిరానికి హాజరైన ప్రజలకు వైద్యపరీక్షలు జరిపి, మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కసిరెడ్డి బాలలక్ష్మీనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు ప్రగడ నాగేశ్వరరావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## బోటనీ, జువాలజీ సబ్జెక్టులు ఇకపై ఒకే పేపరు

జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి ప్రభాకర్



ఓరియంటేషన్ కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి ప్రభాకర్

**తణుకు అర్బన్:** బోటనీ, జువాలజీ సబ్జెక్టులు ఈ ఏడాది నుంచి రెండింటిని కలిపి బయాలజీ పేరుతో ఒకే పేపర్‌గా నిర్వహించబడుతుందని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి జి.ప్రభాకర్ పేర్కొన్నారు. తణుకు ఎస్ఎన్‌వీటీ కళాశాలలో శనివారం జిల్లాలోని బోటనీ, జువాలజీ అధ్యాపకులకు నిర్వహించిన ఓరియంటేషన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గతంలో ఈ రెండు సబ్జెక్టులు విడివిడిగా ఉండేవని, తాజాగా రెండింటిని కలిపినట్లు ఒకే పేపరుగా మార్పులు చేసినట్లు స్పష్టం చేశారు. విద్యార్థులకు ఈ సబ్జెక్టులో మార్కులు అధికంగా రావడానికి అధ్యాపకులు సమన్వయం చేసుకుని సమష్టి కృషి చేయాలని కోరారు. సబ్జెక్టులో వెనుకబడిన విద్యార్థులకు సరళమైన రీతిలో సులభంగా అర్థమయ్యేలా బోధించి జిల్లా ఉత్తీర్ణత శాతం ఈ సబ్జెక్టులో పెంచాలని సూచించారు. ప్రిన్సిపల్ వి.తులసీలక్ష్మి మాట్లాడుతూ గతంలో ఓరియంటేషన్ కార్యక్రమాలు జిల్లా కేంద్రాల్లో జరిగేవని అయితే అధ్యాపకుల సౌలభ్యాన్ని గుర్తించిన డీఐఈవో ప్రభుత్వ కళాశాలల్లో నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పెంటపాడు, పాలకొల్లు అధ్యాపకులు ఎల్.వంశీమోహన్, బి.నారాయణరావులు రిసోర్స్ పర్సన్లుగా వ్యవహరించగా జిల్లా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పని చేస్తున్న వివిధ బోటనీ, జువాలజీ సబ్జెక్టు అధ్యాపకులు పాల్గొన్నారు.

# కరుణించు మా తల్లి.. కనక దుర్గమ్మ



శ్రీ లలితాదేవిగా బలుసులమ్మ



శ్రీ రాజరాజేశ్వరీదేవిగా శ్రీ వాసవి అమ్మవారు



వీకర్స్‌కాలనీలోని గాయత్రి అమ్మవారు



శ్రీ అన్నపూర్ణాదేవిగా శ్రీదేవి మహంకాళమ్మ



మహాకాళికాదేవిగా ముత్యాలమ్మ

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆరో రోజైన శనివారం అమ్మవారు వివిధ అలంకరణల్లో దర్శనమివ్వగా...భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పలుచోట్ల మహిళలు పెద్ద ఎత్తున కుంకుమ పూజలు చేపట్టారు. భక్తులు లేకుండా కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. పట్టణంలో దేవి నవరాత్రి మహోత్సవాలలో భాగంగా పట్టణ ఇలవేల్పు బలుసులమ్మవారిని శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవిగా విశేష అలంకరణ జరిగింది. ఆలయంలో విశేష అలంకరణ, సామూహిక శ్రీ లలితా పారాయణం గావించారు. అమ్మవారికి నవహారతులు అందజేశారు. శ్రీ వాసవి కన్యక పరమేశ్వరీ ఆలయం అమ్మవారిని శ్రీ రాజరాజేశ్వరీదేవిగా విశేష అలంకరణ గావించారు. వీకర్స్‌కాలనీ గాయత్రిదేవి అమ్మవారిని శ్రీలలితాదేవి స్వరూపిణిగాను, వేదమాతగాను అలంకరించారు. విశ్వదుర్గేశ్వరీ అమ్మవారిని గాయత్రి మాతగా అలంకరించారు. శ్రీదేవి మహంకాళమ్మ అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా విశేష అలంకరణ చేశారు.



బలుసులమ్మ ఆలయంలో విశేష అలంకరణ

**కాత్యాయని దేవిగా బాలాత్రిపురీదేవి దర్శనం**

**తాడేపల్లిగూడెం రూరల్:** మండలంలోని వీరంపాలెం శైవక్షేత్రంలోని బాలాత్రిపుర సుందరీ అమ్మవారిని శనివారం కాత్యాయనీ దేవిగా అలంకరించి, మంత్రోక్తంగా పూజలు జరిపారు. పీఠం వ్యవస్థాపకులు గరిమెళ్ళ వెంకటరమణ శాస్త్రి పర్యవేక్షణలో పెన్మెత్స నరసింహరాజు, ఈశ్వరరాజు, సాంబశివరావు దంపతులు పీఠలపై కూర్చొని హోమాలు, పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరమణ శాస్త్రి మాట్లాడుతూ సుమంగళి స్వరూపం కాత్యాయనీ అని, స్త్రీమూర్తులకు మంగళకరమైన జీవితాన్ని ప్రసాదించే సాత్విక దివ్యశక్తి స్వరూపమని పేర్కొన్నారు. కాత్యాయనీ మంత్రం పఠించడం ద్వారా సర్వశుభాలు కలుగుతాయన్నారు. ఆలయ ప్రతినిధులు గరిమెళ్ళ కృష్ణ సందీప్, ఈమని శశికుమార్‌శర్మలు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ముత్యాలంబాపురం శ్రీముత్యాలమ్మ వారిని మహాకాళికాదేవిగా అలంకరించి పూజలందించారు. ఆలయ ఈవో హరేరాంప్రసాద్, సిబ్బంది హరిబాబు, పవన్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



తాడేపల్లిగూడెం రూరల్: కాత్యాయనీ దేవిగా బాలాత్రిపుర సుందరీదేవి

# ఎలుకల నివారణ చేపట్టాలి



అత్తిలి ప్రాంతంలో ఎలుకలు కొరికిన పంటచేను

**అత్తిలి:** రైతులు ముందస్తు మేలైన యాజమాన్య చర్యలు చేపట్టడం ద్వారా ఎలుకలను నివారించవచ్చని మండల వ్యవసాయశాఖ అధికారి టీకే రాజేష్ చెప్పారు. అత్తిలి మండలంలో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమాన్ని వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో చేపట్టారు. సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం, వరిపంటలో ఎలుకలు కలుగజేసే నష్టం, నివారణ పద్ధతులను ఏఓ రాజేష్ వివరించారు. మండలంలో 18 గ్రామ పంచాయతీలలో ఎలుకల నిర్మూలనకు విషపుఎరను అందజేసామని ఆయన చెప్పారు. ఇటీవల వాతావరణం, సేద్యపద్ధతుల్లో వస్తున్న మార్పుల కారణంగా ఎలుకల ఉధృతి అధికంగా కనిపిస్తోంది. నారుమడి దశ నుంచి పంట కోత వరకు ఎలుకలు తీవ్రనష్టాన్ని కలుగ జేస్తుంటాయి. ఒక జత ఎలుకలు ఏడాదికి 400-600 ఎలుకలను ఉత్పత్తి చేస్తాయి. వీటిని పట్టించడానికి రైతులు అధిక మొత్తంలో ఖర్చు చేయాల్సి వస్తుంది. వరిలో ఎలుకల నిర్మూలనకు సామూహిక చర్యలు చేపట్టడం, పొలాల గట్లను తగ్గించి, నివాస స్థావరాలను తొలగించడం, ఎలుకలు పొదలలో ఊదరబెట్టడం, తగిన ప్రదేశాలలో విషపు ఎరలను వాడటం వంటి పద్ధతులను అవలంభించడం ద్వారా ఎలుకల ఉధృతిని తగ్గించవచ్చు.

**ఎలుకల వల్ల వరిపంటకు కలిగేనష్టం**

వరిలో విత్తనం వేసినప్పుడు నుంచి కోత దశ వరకు ఎలుకలు నష్టం కలుగజేస్తాయి. నారుమడిలో చల్లిన విత్తనాలను తినివేస్తాయి. వరి పిలకలు తినడం కంటే, కొరకడానికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తాయి, వరి చిరుపొట్టదశలో



అత్తిలి మండలం కంచుమర్రులో రైతులకు విషపు ఎరలను అందజేస్తున్న దృశ్యం

ఎలుక చేసే నష్టం చాలా కీలకమైనది. ఈదశలో వరిదుబ్బులను గట్ల వెంబడికాక, పొలం మధ్యలో కొరికి, నష్ట పరుస్తుంది. దీనివల్ల పొలంలో అక్కడక్కడా ఖాళీలు కనిపిస్తాయి. ఎలుక బొరియల్లో ధాన్యపు గింజలను నిల్వ చేయడం మరో ప్రధాన నష్టం. ఒక్కొక్క రంధ్రంలో సుమారు అరకిలో నుంచి నాలుగు కిలోల వరకు ధాన్యపు గింజలను నిల్వ చేస్తుంది.

**ఎలుకల ఉధృతికి అనుకూల పరిస్థితులు..**

డెల్టాప్రాంతాలలో కాలువల కింద పండించే వరిపంటలో ఎలుకల ఉధృతి ఎక్కువ. నిరంతం ఆహారం, నీరు, ఆశ్రయం లభ్యత కారణంగా ఈప్రాంతాలు ఎలుకలు సంతానోత్పత్తికి అనుకూలంగా ఉంటాయి.

**ఎలుకల నివారణకు యాజమాన్యం:**

వేసవిలో లోతుగా దుక్కి దున్నాలి. సామూహికంగా రైతులందరూ ఎలుక బుట్టలను, బోనులను పొలంలో దమ్ముచేసే సమయం, పైరు తొలి దశలో ఎకరానికి 20 చొప్పున అమర్చుకోవడం ద్వారా వలస వచ్చే ఎలుకలను నివారించవచ్చు. పొగ పెట్టే యంత్రంను ఉపయోగించి ఎలుక బొరియల్లో పొగను పంపడం ద్వారా ఎలుకలు ఊపిరిఆడక చనిపోతాయి. బ్రోమోడయోలిన్ మందును హెక్టారుకు 10-15 గ్రాముల విషపు ఎరను కాగితంతో పొట్లాలుగా కట్టి ఒక్కొక్క ఎలుక బొరియలో వేయాలి. తిరిగి 11వ రోజున సజీవ ఎలుక బొరియలు ఉంటే మళ్లీ విషపు ఎర పొట్లాలను ఉంచాలి. సమగ్ర యాజమాన్య పద్ధతులను సామూహికంగా చేపట్టినట్లయితే పంటలో ఎలుకల నివారణ జరిగి, దిగుబడులు పొందుతారని వ్యవసాయశాఖ అధికారి రాజేష్ చెప్పారు.

## విద్యార్థినుల సమస్యలను పరిష్కరించాలి

**భీమవరం:** రాష్ట్రంలో విద్యార్థులు అన్ని రంగాల్లో ముందున్నా కానీ ప్రభుత్వం విద్యార్థులకు సరైన విద్య అందించడం లేదని ఎస్ఎఫ్ఐ ఆల్ ఇండియా సహాయ కార్యదర్శి ఐష గోష్ అన్నారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర గార్ల్స్ కన్వెన్షన్ సందర్భంగా భీమవరం టౌన్‌లో పాత బస్టాండ్ నుంచి అంబేడ్కర్ భవనం వరకు 300 మంది విద్యార్థినులతో శనివారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ హాస్టల్స్ ని నిర్మించాలని అన్ని పాఠశాలల్లో కళాశాలలో శానిటరీ ప్యాడ్స్‌ని ప్రభుత్వం అందించాలన్నారు.పె రిగిన ధరలకు అనుకూలంగా మెస్ చార్జెస్ పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పి.రామ్మోహన్, కె.ప్రసన్నకుమార్, రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ సీహెచ్ పావని, కో కన్వీనర్స్ జ్యోతి, చిన్ని, నవిత, అమూల్య తదితరులు పాల్గొన్నారు.

## మహిళపై దాడి

**భీమవరం:** మహిళపై దాడి చేసి గాయపరిచిన సంఘటన భీమవరం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వేమూరి నాగమణి ఆమె భర్త వెంకటేశ్వరరావు భీమవరం ప్రభుత్వాసుపత్రి సమీపంలో నివసిస్తున్నారన్నారు. నాగమణి పోలీయో వ్యాధితో బాధపడుతుందని, ఆమె భర్త వంట పనికి వెళుతుంటాడు. ఈ నేపథ్యంలో 26వ తేది రాత్రి ఒక వ్యక్తి ఇంటి తలుపు తట్టి వంట చేయడానికి పిలుస్తున్నారని వెంకటేశ్వరరావును బయటకు పిలిచారు. ఆయన బయటకు వెళ్లగానే అజ్ఞాత వ్యక్తి లోపలికి ప్రవేశించి నాగమణి చేతుల, మెడపై గాయపరిచాడు. భర్త వెంకటేశ్వరరావు నాగమణిని ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వన్‌టౌన్ ఏఎస్సై తెలిపారు.

## స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేయాలి



తోకతిప్పలో మాట్లాడుతున్న జేఎన్‌వీ గోపాలన్

**భీమవరం అర్బన్:** ఫిల్టర్ బెడ్ బాగుచేసి ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని కుళాయిల ద్వారా సరఫరా చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎన్‌వీ గోపాలన్ డిమాండ్ చేశారు. మండలంలోని తోకతిప్పలో ఆ పార్టీ నాయకులు శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా జేఎన్‌వీ గోపాలన్ మాట్లాడుతూ ఫిల్టర్ బెడ్‌లు బాగు చేయకుండా రక్షిత చెరువులోంచి నేరుగా సరఫరా చేస్తున్నారని గ్రామస్తులు చెబుతున్నారన్నారు. అంతేకాకుండా ఓవర్ హెడ్ ట్యాంకు పైన ధ్వంసమై పెచ్చులూడి పడిపోతుందన్నారు. గ్రామస్తులందరూ 20 లీటర్ల మినరల్ వాటర్‌ను రూ. 35 కొనుగోలు చేసి తాగుతున్నారన్నారు. కనీసం మౌళిక సదుపాయాలైన తాగునీరు అందించకపోడం చాలా బాధాకరమన్నారు. ఫిల్టర్ బెడ్లు, ఓవర్ హెడ్ ట్యాంకు శుభ్రం చేసి ప్రజలకు స్వచ్ఛమైన త్రాగునీటిని అందించాలని లేకుంటే గ్రామస్తులతో నిరసనలు తెలియజేస్తామని హెచ్చరించారు. ఇంజేటి శ్రీనివాస్, రేవు రామకృష్ణ, బొడ్డులక్ష్మీపతి, పొన్నమండ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా దసరా విజయీభవ యాత్ర

**భీమవరం(ప్రకాశం చౌక్):** మన సంస్కృతి సంప్రదాయాలు, ఆచార, వ్యవహారాలు, కట్టుబాట్లు చెరగని ముద్రలని, పండుగలు వాటిల్లో ఒక భాగమని శ్రీపద్మావతి వేంకటేశ్వర స్వామి మందిర అధ్యక్షుడు కంతేటి వెంకటరాజు అన్నారు. భీమవరం హౌసింగ్ బోర్డు కాలనీలోని వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద శ్రీవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శనివారం దసరా విజయీభావ యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు.